సాక్షి
కర్నూలు
మంగళవారం ׀ 3 ׀ జూన్ ׀ 2025



మౌలిక సదుపాయాలు ఎప్పుడో?

శ్రీశైలం దేవస్థాన ఉద్యోగులకు వసతి గృహాలు పూర్తయ్యాయి. అయితే వాటిల్లో ఉండేందుకు మౌలిక సదుపాయాలు కల్పించలేదు. IIలో▸



సర్వర్ పనిచేయక..

చౌక దుకాణాల్లో రేషన్ సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. ఆదివారం పలుచోట్ల సర్వర్ పనిచేయక ప్రజలు ఇబ్బంది పడ్డారు. IIలో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,599
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:20.018
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:20,053
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:236

న్యూస్‌రీల్

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): అర్జీదారులు సంతృప్తి చెందేలా వినతులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్)లో భాగంగా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలకు నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. మండలాల ప్రత్యేకాధికారులు తమ పరిధిలోని అన్ని గ్రామాలను సందర్శించి సమస్యలను తెలుసుకోవాలన్నారు. తనిఖీల వివరాలను గ్రామల వారీగా తనకు అందించాలని సూచించారు.

డ్రోన్ ధర రూ.10 లక్షలా!

- బహిరంగ మార్కెట్‌లో బ్యాటరీ సహా రూ.8 లక్షలే..
- కొనుగోలుకు ముందుకురాని గ్రూపులు

కర్నూలు(అగ్రికల్చర్): పలు కంపెనీల డ్రోన్‌లు బహిరంగ మార్కెట్‌లో రూ.8 లక్షలకే లభిస్తున్నాయి. బ్యాటరీ లేకుండా అయితే రూ.6 లక్షలు, బ్యాటరీతో కలిపి రూ.8 లక్షలకే క్వాలిటీ డ్రోన్‌లు అందుబాటులో ఉన్నాయి. అయితే వ్యవసాయ శాఖ అందజేస్తున్న డ్రోన్‌ల ధరలో భారీగా వ్యత్యాసం ఉండటం చర్చనీయాంశమైంది. వ్యవసాయ శాఖ సరఫరా చేస్తున్న డ్రోన్‌ల యూనిట్ కాస్ట్ రూ.9.81లక్షలు. ప్రభుత్వం 80 శాతం సబ్సిడీ ఇస్తోంది. జిల్లాలో విహంగ, డ్రోగో కంపెనీలు కిసాన్ డ్రోన్‌లను సరఫరా చేస్తున్నాయి. యూనిట్ కాస్ట్‌లో ఎఫ్‌ఎంజీ కిసాన్ డ్రోన్ గ్రూపులు 50 శాతం చొప్పున రూ.4.90 లక్షల ముందుగానే చెల్లించాల్సి ఉంది. మిగిలిన 50 శాతం బ్యాంకు లోన్ కింద సమకూరిస్తేనే యూనిట్ గ్రౌండ్ అవుతుంది. జిల్లాకు 35 డ్రోన్‌లను మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ పరిపాలన అనుమతులు ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు జిల్లాలో ఐదు గ్రూపులు మాత్రమే 50 శాతం మొత్తాన్ని చెల్లించాయి. సిబిల్ స్కోర్ కారణంగా బ్యాంకుల నుంచి లోన్ పొందడం గగనమవడం.. యూనిట్ కాస్ట్ కూడా ఎక్కువగా ఉండటం పట్ల గ్రూపు సభ్యుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

సబ్సిడీ విత్తనాలకు రైతుల పేర్లు నమోదు

కర్నూలు(అగ్రికల్చర్): విత్తనాల పంపిణీలో జరుగుతున్న జాప్యంపై రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతుండటంతో వ్యవసాయ శాఖ స్పందించింది. సబ్సిడీపై వేరుశనగ, పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలు, ఇతర విత్తనాలు పొందేందుకు రైతులు వెంటనే సంబంధిత రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కర్నూలు జిల్లాకు 10,261.50 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 8,766 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించింది. వేరుశనగతో సహా విత్తనాల కోసం ఆర్‌ఎస్‌కేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని రైతులకు వ్యవసాయ అధికారులు సూచించారు. రైతులు నాన్ సబ్సిడీ చెల్లించి వేరుశనగ పొందవచ్చని సూచించారు. ఒక రైతుకు వేరుశనగ సాగుచేసే భూమిని బట్టి గరిష్టంగా 10 ప్యాకెట్లు(మూడు క్వింటాళ్లు) ఇస్తారు. కిలో పూర్తి ధర రూ.93 ఉండగా.. 40 శాతం సబ్సిడీ ఉంటుంది. ఒక ప్యాకెట్‌లో 30 కిలోల వేరుశనగ విత్తనం కాయలు ఉంటాయి. ప్యాకెట్ పూర్తి ధర రూ.2,790 ఉండగా.. సబ్సిడీ రూ.1,116 ఉంటుంది. సబ్సిడీ పోను రైతులు రూ.1,674 చెల్లించాల్సి ఉంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరారు.

ఎరువులు తరలిపోకుండా తనిఖీలు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్ మొదలైన నేపథ్యంలో జిల్లా నుంచి రసాయన ఎరువులు ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా బార్డర్ చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేపట్టేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేస్తూ కలెక్టర్ రంజిత్‌బాషా ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు మండలంలో పంచలింగాల, మంత్రాలయం మండలంలో మాధవరం, హాలహర్వి మండలంలో చింతకుంట, కౌతాలం మండలంలో బాపురం, ఆదోని మండలంలో పెద్దహరివాణం గ్రామాల్లో బార్డర్ చెక్‌పోస్టులు ఉన్నాయి. జిల్లాకు వచ్చిన ఎరువులను హోల్‌సేల్ డీలర్లు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు తరలించే ప్రమాదం ఉన్నట్లు జిల్లా యంత్రాంగం గుర్తించింది. రసాయన ఎరువులు ఇతర రాష్ట్రాలకు తరలించడాన్ని సమూలంగా నిర్మూలించేందుకే ప్రత్యేక టీములు ఏర్పాటయ్యాయి. ప్రతి చెక్‌పోస్టు ప్రత్యేక టీమ్‌లో డిప్యూటీ తహసీల్దారు, మండల వ్యవసాయ అధికారి, స్టేషన్ హౌస్ ఆఫీసర్, మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఉంటారు.

చదువులు బండబడి

- గందరగోళంగా పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ
- సాంకేతిక కారణాలతో డిజిటల్ చదువుకు ఎగనామం
- ఇప్పటికీ అతీగతీ లేని తల్లికి వందనం
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు పైసా చెల్లించని వైనం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విప్లవాత్మక మార్పులు
- మనబడి నాడు–నేడుతో మారిన రూపురేఖలు

కూటమి ప్రభుత్వంలో పేదల బడి నిర్వీర్యమవుతోంది. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ గందరగోళానికి దారితీస్తుండగా.. విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టిన పనులను ఏడాది కాలంగా విస్మరించింది. విద్యా దీవెన, వసతి దీవెనలను పట్టించుకోకపోవడంతో ఉన్నత విద్య ప్రశ్నార్థకమవుతోంది. గత ప్రభుత్వం డిజిటల్ చదువులను పేద విద్యార్థులకు చేరువ చేయగా.. ఈ ప్రభుత్వం ట్యాబ్‌లను దూరం చేసి పిల్లల బంగారు భవిష్యత్‌ను తిరోగమన దిశగా పయనింపజేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దితే.. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయించలేకపోవడం గమనార్హం. – కర్నూలు సిటీ



పాఠశాల విద్యలో గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అనేక విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు జీఓ 117 తీసుకొచ్చి 6 రకాల బడులను ఏర్పాటు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే 117 జీఓను రద్దు చేస్తామనే ప్రచారం చేసింది. అయితే ఎన్డీఏ కూటమిలో ఆ జీఓను రద్దు చేసేందుకు ఆస్కారం లేకపోవడంతో ప్రత్యామ్నాయానికి తెరతీసింది. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పేరిట 6 రకాల బడులను 9 రకాలుగా మార్పు చేస్తూ గందరగోళానికి పాల్పడుతోంది. వాస్తవానికి 2017 అప్పటి ఇదే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓలు 29, 42 కారణంగా ప్రాథమిక విద్య నిర్వీర్యమైంది. ఫలితంగా అప్పట్లో జిల్లాలో 79 స్కూళ్లు మూతపడ్డాయి.

అమలుకాని తల్లికి వందనం

ఎన్నికల సమయంలో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం కింద ఒక్కొక్కరికీ రూ.15 వేలు ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. అదిగో.. ఇదిగో అంటూ బడ్జెట్ సమావేశాల్లో ఏప్రిల్, మే నెల చివరిలో ఇస్తామని మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్ అంసెబ్లీలో మాటిచ్చారు. ఆ తరువాత కొద్ది రోజులకే జూన్‌లో స్కూళ్లు పునఃప్రారంభం అయ్యాక ఇస్తామని నాలుక మడతేయడం గమనార్హం.

కొండలా ఫీజు బకాయిలు

పేద విద్యార్థుల చదువులకు ఫీజులు భారం కాకూడదని యూనివర్సిటీలలో ఎంత ఫీజులు ఉంటే అంత మొత్తాన్ని జగనన్న విద్యా దీవెన కింద తల్లిదండ్రులపై నయాపైసా భారం పడకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. విశ్వవిద్యాలయాలు నిర్ణయించిన ఫీజు మొత్తాన్ని అప్పటి ప్రభుత్వమే చెల్లించింది. అయితే నేడు కోర్సు పూర్తయినా ఫీజు చెల్లించకపోవడంతో సర్టిఫికెట్లు అందక కొందరు, పరీక్షలు రాయలేక మరి కొందరు మధ్యలోనే చదువులు మానేయాల్సిన దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెండింగ్ బకాయిలు చెల్లించకపోగా 2024–25 ఏడాదిలో చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ సుమారు రూ.34 కోట్లు చెల్లించాల్సి ఉంది. 2023–24 ఫీజులు సుమారు రూ.71 కోట్ల బకాయి ఉంది.

అరకొరగానే విద్యా కానుక

తల్లిదండ్రులకు పిల్లల చదువులు భారం కాకుడదని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక జగనన్న విద్యా కానుక పేరిట కిట్ల రూపంలో యూనిఫాం, పుస్తకాలు, బ్యాగ్‌లు, బూట్లు, బెల్ట్, డిక్షనరీలు, సాక్సులు, నోట్ పుస్తకాలను అందజేశారు. ఏటా సుమారు 2.90 లక్షల మంది విద్యార్థులకు ఒక్కో కానుక కిట్టు రూ.2 వేల ప్రకారం రూ.2 వేల కోట్లకుపైగా ఖర్చు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర యాప్ పథకంగా మార్పు చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పుస్తకాలు, కిట్లలోని వస్తువులు చేరని పరిస్థితి. బ్యాగ్‌లు ఒక్క మండలానికి మాత్రమే రాగా.. బూట్లు, పిక్టోరియల్ డిక్షనరీల ఊసే కరువైంది.

నాణ్యత లేని మధ్యాహ్న భోజనం

కూటమి ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకానికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా మార్పు చేసింది. గత ప్రభుత్వం అమలు చేసిన మెనూను కొనసాగిస్తున్నా నాణ్యతను విస్మరించింది. వంట ఏజెన్సీలను ఎలాంటి కారణం లేకుండా తొలగించి టీడీపీ వర్గీయులకు కట్టబెట్టడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. ఇంటర్ పిల్లలకు మధ్యాహ్న భోజనం పెడతామని ఈ ఏడాది జనవరి నుంచి మొదలు పెట్టినా ఇప్పటి వరకు ఏజెన్సీలకు బిల్లులు చెల్లించకపోవడం గమనార్హం.

టాయ్‌లెట్ల నిర్వహణ అస్తవ్యస్తం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బాల, బాలికలకు వేర్వేరుగా అత్యాధునిక మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటిని ప్రతి రోజూ శుభ్రం చేసేందుకు 1,741 మంది ఆయాలను నియమించారు. శుభ్రం చేసేందుకు అవసరమైన రసాయనాలను సైతం పంపిణీ చేస్తూ ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయిలో పర్యవేక్షణ చేశారు. అయితే కూటమి ప్రభుత్వంలో టాయ్‌లెట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. జిల్లాలోని 240 ఉన్నత పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్లకు ఈ ప్రభుత్వం మూడు నెలలుగా జీతాలు చెల్లించని పరిస్థితి నెలకొంది.

నిర్వహణ 'మరుగు'న పడి



కోసిగి కుమ్మరి విధిలోని ప్రైమరీ స్కూల్‌లో పూర్తికాని మరుగుదొడ్లు

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మొత్తం 1,436 ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో బాల, బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లను నిర్మించింది. వీటిని ప్రతి రోజు శుభ్రం చేసేందుకు 1,741 మంది ఆయాలను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా మారింది. ఆయాలకు గతంలో రెగ్యులర్ వేతనాలు వచ్చేవి. నేడు మూడు, నాలుగు నెలలు అయినా అందని పరిస్థితులు నెలకొన్నాయి.

'చిక్కీ'పోయిన మాధ్యాహ్న భోజనం

ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. జిల్లాలోని 23 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జనవరి నెల నుంచి అమలు చేస్తున్నారు. ఇందుకు రూ.20 లక్షలకుపైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఏప్రిల్ 1నుంచే 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభించారు. కానీ విద్యార్థులకు కోడి గుడ్లు, చిక్కీలు ఇవ్వలేదు.



కర్నూలు టౌన్ మోడల్ కాలేజీలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు భోజనం పెడుతున్న ఏజెన్సీ నిర్వాహకులు

తరగతి గది అధోగతి!



కర్నూలు కేవీఆర్ గార్డెన్‌లో పూర్తికాని ఉర్దూ స్కూల్ అదనపు తరగతి గదుల భవనం

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన మన బడి నాడు–నేడు కార్యక్రమానికి గ్రహణం పట్టింది. అప్పట్లో జిల్లాలో మొదటి విడతలో 594 పాఠశాలల్లో రూ.166.25 కోట్లు ఖర్చు చేశారు. రెండో విడతలో 1,051 స్కూళ్లలో రూ.504.16 కోట్లతో పనులు చేపట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో ఏడాదిగా పనులు నిలిచిపోయాయి. అదనపు తరగతి గదుల పనులు పునాదులకే పరిమితం అయ్యాయి.

డిజిటల్ విద్యకు గ్రహణం

జిల్లాలోని 90 స్కూళ్లను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీబీఎస్‌ఈ స్కూళ్లుగా మార్చగా, కూటమి ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. ఆంగ్ల మాధ్యమాన్ని పేద విద్యార్థులకు దూరం చేసేందుకు కుట్ర చేస్తోంది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ) ద్వారా డిజిటల్ విద్యను పేద విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ట్యాబ్‌లతో పాటు, బైజూస్ డిజిటల్ కంటెంట్‌ను చేరువ చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో వీటిని పట్టించుకోకపోగా.. ట్యాబ్‌ల పంపిణీని నిలిపేసింది.

కార్పొరేట్ చేతిలో సెకండరీ విద్య

ఇంటర్మీడియెట్‌లో సంస్కరణల పేరిట గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇంటర్మీడియెట్ విద్యా మండలిలో నారాయణ కాలేజీ ప్రిన్సిపాల్‌ను సభ్యులుగా నియమించి సెకండరీ విద్యను కార్పొరేట్‌కు తాకట్టు పెట్టింది కూటమి ప్రభుత్వం. ఈ ఏడాది నుంచి ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను అమలు చేస్తామని.. కాలేజీలు పునఃప్రారంభం రోజు నాటికి కొత్త పాఠ్యపుస్తకాలు ఇస్తామని గొప్పలు చెప్పుకున్నారు. అయితే ఇంత వరకు ఒక్క పాఠ్య పుస్తకం కూడా అందించలేకపోయారు.







గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలో నాడు–నేడు కింద అభివృద్ధి చేసిన పాఠశాల

రూ.1438.87 కోట్లు
(గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమ్మఒడి ద్వారా 1 నుంచి 12వ తరగతి విద్యార్థులకు నాలుగేళ్లలో తల్లుల ఖాతాల్లో జమ చేసిన మొత్తం.)

రూ.501.56 కోట్లు
(నాలుగున్నరేళ్లలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన కింద తల్లుల ఖాతాల్లో జమ చేసిన మొత్తం.)

రూ.166.25 కోట్లు
(మన బడి నాడు–నేడు కింద మొదటి విడతలో 594 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు వెచ్చించిన మొత్తం.)

రూ.504.16 కోట్లు
(మన బడి నాడు–నేడు కింద రెండవ విడతలో 1,051 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు వెచ్చించిన మొత్తం.)

పిల్లల చదువు భారమవుతోంది



మాకు ఇద్దరు పిల్లలు. ఒకరు కర్నూలులోని కెవిఆర్ కాలేజీలో చదువుతున్నారు. మరొకరు సీ క్యాంపు దగ్గర ఉన్న కాలేజీలో చదువుతున్నారు. ఎన్నికల సమయంలో తల్లికి వందనం కింద రూ.15 వేలు, ఫీజుల పథకం కింద మొత్తం ఫీజులు చెల్లిస్తామని చెప్పినారు. కానీ ఇంత వరకు రూపాయి కూడా ఇవ్వలేదు. మాలాంటి పేదలు పిల్లలను చదివించుకోవాలంటే భారంగా ఉంది. ఆ డబ్బులు ఇచ్చింటే కొంచెం ఊపిరాడేది.

– మణెమ్మ, రైతు కూలీ, సింగవరం

ఆ బడులను చూస్తే చదువుకోవాలనిపిస్తాది



గత ప్రభుత్వం బడులను ఎంతో బాగా కట్టించింది. వాటిని చూస్తేనే పిల్లలకు బడికి పోవాలని అనిపిస్తుంది. చాలా మంది ప్రయివేట్ స్కూళ్లు మానిపించి ప్రభుత్వ బడికి పంపించినారు. మధ్యాహ్న భోజనం కూడా చానా బాగుందని అందరూ చెబుతుండ్రి. ఇప్పుడేమో ఆ స్కూళ్లను ఎవరూ పట్టించుకుంటలేరు. కొన్ని స్కూళ్లను తీసేస్తున్నారంట. ఇంకా బాగు చేయాలి కానీ, ఇలా చేస్తే పిల్లలు ఎట్లా బాగుపడతారు.

– ఎలీసా, ఉల్చాల గ్రామం

ఆర్‌యూలో కొత్త కోర్సులు



మాట్లాడుతున్న వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెంకట బసవరావు, చిత్రంలో రెక్టార్, రిజిస్ట్రార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరం నుంచి ఎంఎస్సీ ఫుడ్ అండ్ న్యూట్రీషన్, నాలుగు సంవత్సరాల బీకాం కంప్యూటర్ అప్లికేషన్ కోర్సులను ప్రవేశ పెడుతున్నట్లు వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు తెలిపారు. సోమవారం వర్సిటీలోని వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వర్సిటీ అభివృద్ధికి చేపడుతున్న చర్యలను వీసీ వివరించారు. క్వాంటమ్ టెక్నాలజీ, పునరుత్పాదక శక్తి వనరులు(రెనేబుల్ ఎనర్జీ), డ్రోన్ టెక్నాలజీలకు సంబంధించి క్యాంపస్ విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించనున్నామన్నారు. పరిశోధనలను ప్రోత్సహించడంలో భాగంగా సెమినార్లు, కాన్ఫరెన్స్‌లతో పాటు విద్యార్థులు, అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు ప్రతి డిపార్ట్‌మెంట్‌కు రూ.50 వేల నిధులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. వివిధ పీజీ కోర్సులతో పాటు, ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకుల కొరతను అధిగమించడానికి తాత్కాలిక అధ్యాపకులను నియమిస్తామన్నారు. ఇంజినీరింగ్ కళాశాల, కంప్యూటర్ సైన్స్, ఏఐ విభాగాల్లో రూ.2 కోట్లతో అధునాతన ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే పీజీ సెమిస్టర్ పరీక్షల నుంచి ఆన్‌లైన్ వాల్యుయేషన్ విధానాన్ని ప్రవేశ పెడుతున్నామన్నారు. వర్సిటీ పునః ప్రారంభమయ్యాక టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులకు ఫేషియల్/ బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశ పెడతామన్నారు. రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో టీడీపీకి షాక్!

- పార్టీకి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన 21వ వార్డు కౌన్సిలర్
- త్వరలో కౌన్సిలర్ బాటలో మరికొందరు



వాల్మీకి దయసాగర్

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలో కూటమి ప్రభుత్వానికి పెద్ద షాక్ తగిలింది. తెలుగుదేశం పార్టీకి, పార్టీ సభ్యత్వానికి 21వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వీజీఏ. వాల్మీకి దయసాగర్ సోమవారం రాజీనామా చేయటం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. 11 సంవత్సరాలు తెలుగుదేశం పార్టీలో చురుకైన కార్యకర్తగా అనేక బాధ్యతలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఎర్పడి సంవత్సరం కావస్తుంది, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చటంలో పూర్తిగా విఫలమైందని ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్న తరుణంలో సొంత పార్టీ నేత, వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి రాజీనామా కూటమి ప్రభుత్వానికి కోలుకోలేని షాక్ ఇచ్చినట్లయింది. కూటమి ప్రభుత్వం ఇంకా నాలుగు సంవత్సరాలు అధికారంలో ఉంటుంది, అయినా అధికార పార్టీకి రాజీనామా చేయటం గమనార్హం. కౌన్సిలర్ బాటలోనే మరికొందరు రాజీనామాలకు సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

లంచగొండి పోలీసులకు రిమాండ్



ఏసీబీకి పట్టుబడిన సీఐ, హెడ్ కానిస్టేబుల్

కర్నూలు: రూ.80 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన నాలుగో పట్టణ సీఐ మధుసూదన్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ రవికుమార్‌లను రిమాండ్‌కు ఆదేశిస్తూ రాయలసీమ జిల్లాల ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎస్.శ్రీవిద్య సోమవారం తీర్పు చెప్పారు. సీఐ మధుసూదన్ గౌడ్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ దాడి కేసులో నిందితుడు బెస్త రవి నుంచి కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న నిర్మల్ హోటల్‌లో రూ.80 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన సంగతి తెలిసిందే. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సీఐ, హెడ్ కానిస్టేబుల్ ఇళ్లలో ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించారు. సీఐ ఇంట్లో భారీగా బంగారు నగలు, స్థిరాస్తి పత్రాలు బయట పడినట్లు తెలిసింది. తనిఖీల అనంతరం పంచనామా పూర్తి చేసి మున్సిఫ్ కోర్టు ఆవరణలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. ఇదిలా ఉంటే ఎస్పీ విక్రాంత్ పాటిల్ సిఫారసు మేరకు సీఐ మధుసూదన్ గౌడ్, హెడ్‌కానిస్టేబుల్ రవికుమార్‌లను సస్పెండ్ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కేసు నీరుగార్చేందుకు ఒత్తిళ్లు

సీఐ మధుసూదన్ గౌడ్ ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ మంత్రికి బాగా కావలసిన అధికారి. ఈ నేపథ్యంలో కేసు తీవ్రతను తగ్గించి మాధ్యమాల్లో ప్రచారం కాకుండా తీవ్ర ఒత్తిడి చేసినట్లు పోలీసు శాఖలో చర్చ జరుగుతోంది. సీఐ గత ఏడాది ఆగస్టులో నాలుగో పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టారు. పోస్టింగ్ కోసం అధికార పార్టీకి చెందిన ముగ్గురు నేతలకు ముడుపులు ముట్టజెప్పి వచ్చినట్లు సమాచారం. దీంతో ఈయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పాత కేసులను కూడా తిరగదోడి డబ్బులు దండుకున్నట్లు స్టేషన్‌లో పనిచేసే ఉద్యోగులే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. సీఐ పోస్టు ఖాళీ కావడంతో పలువురు పోస్టింగ్ కోసం ప్రయత్నాలు ప్రారంభించినట్లు పోలీసు శాఖలో చర్చ జరుగుతోంది. ప్రత్యేక విభాగంలో పనిచేస్తున్న ఓ అధికారి, నంద్యాలకు సమీపంలోని సర్కిల్‌లో పనిచేస్తున్న మరో సీఐ, గతంలో కర్నూలు అర్బన్ తాలూకాలో పని చేసి బదిలీపై వెళ్లి వీఆర్‌లో ఉన్న మరో సీఐ ఈ సర్కిల్ పోస్టింగ్ కోసం ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

రెండో రోజూ పడిగాపులే!

కర్నూలు(సెంట్రల్): రేషన్ దుకాణాల్లో రెండో రోజు సర్వర్ సమస్య తలెత్తింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వర్ సక్రమంగా రాకపోవడంతో లబ్ధిదారులు దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. జిల్లాలోని 1,233 రేషన్ దుకాణాల్లోనూ ఇదే పరిస్థితి. ఈ కారణంగా కార్డుదారులు షాపుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చింది. జిల్లాలో మొదటిరోజు ఆదివారం 18 శాతం, రెండో రోజు 16 శాతం మంది కార్డుదారులకు మాత్రమే సరుకుల పంపిణీ పూర్తయింది.

క్షణికావేశంలో వివాహిత బలవన్మరణం


ఆత్మహత్య చేసుకున్న కల్పన

పత్తికొండ: స్థానిక కుమ్మరగేరికి చెందిన కుమ్మరి కల్పన (28) క్షణికావేశంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం ఇల్లు శుభ్రం చేసే విషయంలో భర్త రాజశేఖర్ ఆచారితో చిన్నపాటి వివాదం తలెత్తినట్లు సమాచారం. దీంతో మనస్తాపానికి గురైన కల్పన సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ జయన్న తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి దుర్మరణం

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం పోలీసుస్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో చాకలి నాగేశ్ (28) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన చాకలి నాగేష్ ట్రాక్టర్ లోడింగ్ పని నిమిత్తం కూలీగా వచ్చారు. ట్రాలీలో నాపరాయి లోడ్ వేసుకొని డ్రైవర్ రామాంజనేయులుతో కలిసి బేతంచెర్ల గ్రామానికి వాహనంలో బయల్దేరారు. పలుకూరు గ్రామ సమీపంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించే క్రమంలో డ్రైవర్ స్టీరింగ్‌ను తిప్పడంతో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాలీలో కుర్చున్న చాకలి నాగేశ్ కింద పడగా నాపరాళ్లు అతనిపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య రమాదేవి, ఇద్దరు సంతానం ఉన్నారు.


మృతి చెందిన చాకలి నాగేశ్


బర్మా గడ్డలో మహిళల నిరీక్షణ


కప్పల్ నగర్‌లో దుకాణం వద్ద వేచిచూస్తున్న కార్డుదారులు


లక్ష్మీ నగర్‌లో బారులు తీరిన జనం

సర్వర్ పనిచేయక.. సరుకులు అందక!

రేషన్ సరుకులకు మళ్లీ జనానికి తిప్పలే. దుకాణం తెరిచి ఉందో లేదోనని పిల్లలను చూసి రమ్మని పంపడం ఇక మీదట కార్డుదారులు అలవాటు చేసుకోవాల్సిందే. ఇంట్లో ఎవరో ఒకరు పని మానుకొని దుకాణం వద్ద పడిగాపులు కాయాల్సిందే. అంతేకాదు.. ఇప్పుడు సర్వర్ పని చేస్తుందో లేదోననే బెంగ కూడా కార్డుదారులను వేధిస్తోంది. ఒకటో తేదీ నుంచి సరుకుల పంపిణీ ప్రారంభం కాగా అస్తవ్యస్త పంపిణీ స్వాగతం పలకడం తెలిసిందే. ఇక రెండో రోజు సోమవారం కర్నూలు నగరంలో సర్వర్ సమస్యతో సరుకుల పంపిణీ నిలిచిపోయింది. ఈ కారణంగా కార్డుదారులు దుకాణాల చుట్టూ రోజంతా తిరగడంతోనే సరిపోయింది. రాత్రి సమయంలోనూ పడిగాపులు కాయాల్సి వచ్చింది. విధిలేని పరిస్థితుల్లో సరుకులు తీసుకోకుండానే ఇళ్లకు వెళ్లిపోవాల్సి వచ్చింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


నరసింహా రెడ్డి నగర్‌లో కార్డుదారులు వెనుదిరగడంతో వెలవెలబోతున్న దుకాణం


దేవనగర్‌లో గంటల తరబడి అవస్థలు

వెన్నుపోటు దినానికి వలంటీర్ల మద్దతు

కర్నూలు(సెంట్రల్)/ బొమ్మలసత్రం: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు నిరసన దినానికి వలంటీర్ల సంపూర్ణ మద్దతు ఉంటుందని నంద్యాల, కర్నూలు జిల్లా వలంటీర్ల సంఘం అధ్యక్షులు హరికృష్ణ, నూర్ అహ్మద్ తెలిపారు. చంద్రబాబునాయుడు వెన్నుపోటుకు మొదట బలైంది వలంటీర్లేనని, రూ.10 వేల జీతం ఇస్తానని ఊడదీయడంతో ఉపాధి లేకుండా రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. తమనే కాకుండా సమాజంలోని మహిళలు, వృద్ధులు, యువకులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులకు కూడా వెన్నుపోటు పొడిచారన్నారు. ఎండీయూ బండ్లను నడుపుకొని ఉపాధిని తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ప్రతి వర్గాన్ని మోసం చేసిన చంద్రబాబునాయుడుకు బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందన్నారు. వెన్నుపోటు దినానికి వలంటీర్లు పెద్ద ఎత్తున హాజరై మద్దతు తెలపాలని ఆయన కోరారు.

జలప్రసాద కేంద్రంలో మంటలు

మహానంది: మహానంది దేవస్థానం ప్రాంగణంలోని బుకింగ్ కౌంటర్ (చిన్న గేటు) వైపు ఉన్న జలప్రసాద కేంద్రంలో సోమవారం మంటలు ఎగిసిపడ్డాయి. ఎలక్ట్రికల్ విభాగం సిబ్బంది శ్రీనివాసులు, దశరథ మరమ్మతులు చేస్తుండగా తీగల వద్ద షార్ట్ సర్క్యూట్ అవడంతో మంటలు చెలరేగాయి. దీంతో వారు వెంటనే అప్రమత్తమై పరుగులు తీస్తూ బయటికి చేరుకుని విద్యుత్ సరఫరా నిలిపివేసి సరిచేయడంతో ప్రమాదం తప్పింది.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


మృతిచెందిన నాగేశ్

ఆస్పరి: మండల కేంద్రానికి సమీపంలోని శ్మశాన వాటిక వద్ద సోమవారం ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన మంగళి నాగేశ్ (45)కు భార్య సుజాత ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వీరిలో పెద్దకూతురు లక్ష్మికి వివాహం చేశారు. నాగేశ్ పోలకల్ గ్రామం నుంచి కర్నూలులో ఉంటున్న కూతురు లక్ష్మి, అల్లుడు శివ వద్దకు వెళ్లి రెండు రోజులు అక్కడే ఉన్నాడు. మద్యం అలవాటు ఉన్న నాగేశ్‌కు మతిస్థిమితం సరిగా లేదు. ఈ క్రమంలో సోమవారం ఆస్పరి సమీపంలోని శ్మశాన వాటిక వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటుగా పొలాలకు వెళ్లే రైతులు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వెళ్లి చూసేసరికి నాగేశ్ మృతి చెందాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో భార్య సుజాత, కుటుంబసభ్యులు వచ్చి మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ప్లాస్టిక్ కాలుష్యంతో అనారోగ్యం


పర్యావరణ పరిరక్షణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): సమాజంలో ప్రతి ఒక్కరూ పర్యావరణంపై ప్లాస్టిక్ కాలుష్య ప్రభావాన్ని తగ్గించేందుకు సిద్ధమవ్వాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముద్రించిన వాల్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి ప్లాస్టిక్ పెనుభూతమై కూర్చుందన్నారు. ప్లాస్టిక్‌ను నిర్మూలించకపోతే భవిష్యత్ తరాలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, పీసీబీ ఈఈ కిషోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

30 వరకు మలేరియా నివారణ మాసోత్సవాలు

మలేరియా నివారణ మాసోత్సవాలను ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మలేరియా నివారణ మాసోత్సవాలపై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'చిన్నటేకూరు' ప్రతిభ

- ఐఐటీ కౌన్సెలింగ్‌కు 31 మంది విద్యార్థుల అర్హత

కర్నూలు(అర్బన్): జేఈఈ అడ్వాన్స్‌డ్ (ఐఐటీ) 2025లో కల్లూరు మండలం చిన్నటేకూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు అద్భుత విజయాలు సాధించారని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఉమ్మడి జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి తెలిపారు. మొత్తం 46 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు హాజరు కాగా 31 మంది విద్యార్థులు ఐఐటీ కౌన్సెలింగ్‌కు అర్హత సాధించారని ఆమె సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 11 మంది విద్యార్థులు టాప్ ఐఐటీలలో ప్రవేశం పొందే అఖిల భారతీయ ర్యాంకులు సాధించారన్నారు. వీరిలో వినుకొండ నవదీప్ ఏఐఆర్ 646, మల్లవల్లి అభి శ్రీకాంత్ ఏఐఆర్ 711వ ర్యాంకు సాధించారని తెలిపారు. మిగతావారు ఎన్‌ఐటీఎస్, ఐఐఎస్‌ఈఆర్‌ఎస్, ఐఐఎస్‌టీ వంటి కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రవేశం పొందే అవకాశం కలిగి ఉన్నారన్నారు. ఈ సందర్భంగా మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను, అకాడమీ డైరెక్టర్ బీ.ఉమా మహేశ్వరప్ప, ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

కెమికల్స్ నిధులు స్వాహా!

- దొంగ బిల్లులు సృష్టించి నిధులు మింగేసిన వైనం
- భూసార పరీక్షల నాణ్యతపై అనుమానాలు

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న భూసార పరీక్షలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూసార పరీక్షలు చేసేందుకు వివిధ రకాల కెమికల్స్ అవసరం. కెమికల్స్ కొనుగోలుకు విడుదల చేసిన నిధులను స్వాహా చేసి భూసార పరీక్షలు మమ అనిపించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూసార పరీక్షలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. శాస్త్రవేత్తలు, వ్యవసాయ యంత్రాంగం వీటి ఫలితాలను అనుసరించే పంటల సాగుకు స్థూల, సూక్ష్మ పోషకాలు వినియోగించాలని చెబుతుంటారు. ఇందుకు అనుగుణంగా రైతులు ముందుకు వెళితే పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. ఈ పరీక్షలను పక్కాగా నిర్వహిస్తే సత్ఫలితాలు ఉంటాయి. అయితే భూసార పరీక్షల్లో నాణ్యత ఎంతుంది అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

- 2024–25 సంవత్సరానికి భూసార పరీక్షలకు అవసరమైన కెమికల్స్ కొనుగోలు చేసేందుకు రూ.15 లక్షలు విడుదలయ్యాయి. అధికార యంత్రాంగంలో స్వార్థం పెరిగిపోవడంతో కెమికల్స్ కొనకుండానే కొన్నట్లు బిల్లులు సృష్టించి నిధులు కాజేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దొంగ బిల్లులతో కొల్లగొట్టిన నిధుల పంపకాల్లో తేడాలు వచ్చి ఒకరికొకరు విమర్శించుకున్నట్లు సమాచారం. కెమికల్స్ కొనుగోలు కోసం వచ్చిన నిధులను స్వాహా చేసి భూసార పరీక్షలు మమ అనిపించారు. దీన్ని బట్టి చూస్తే భూసార పరీక్షల్లో నాణ్యతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.
- 2025–26 సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో 50 వేలకుపైగా భూసార పరీక్షలు చేయాలనేది లక్ష్యం. గతేడాది కెమికల్స్ నిధులు దారిమళ్లడంతో నేడు పరీక్షలు చేసేందుకు అవసరమైన కెమికల్స్ లేవు. ప్రభుత్వం మళ్లీ కెమికల్స్ కొనుగోలుకు నిధులు విడుదల చేస్తేనే భూసార పరీక్షలు ముందుకు సాగే అవకాశం ఉంది. మామూలుగా అయితే ఖరీఫ్ సీజన్ మొదలయ్యే సమయానికి భూసార పరీక్షలు చేసి ఫలితాలను రైతులకు చేరవేయాలి. కర్నూలు జిల్లాలో 25942 భూసార పరీక్షలు చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 15 వేల వరకు మట్టి నమూనాలు సేకరించారు. సగం మట్టి నమూనాలను కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని భూసార పరీక్షల కేంద్రం, మిగతా సగం మట్టి నమూనాలకు ఎమ్మిగనూరు భూసార పరీక్షల కేంద్రంలో పరీక్షలు చేస్తారు. కెమికల్స్ లేకపోవడం వల్ల ఇంతవరకు భూసార పరీక్షలు నిర్వహించే ప్రక్రియ మొదలు కాలేదు. దీన్ని బట్టి చూస్తే భూసార పరీక్షలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పాముకాటుతో మహిళ మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో ఓ మహిళ సోమవారం పాముకాటుకు గురై మృతి చెందింది. వివరాలు.. గ్రామానికి చెందిన తవిసి కొండ తిమ్మయ్య భార్య రంగమ్మ (46) గ్రామంలో వేరుశనగ పంట తొలగింపు పనులకు వెళ్లి పైరును తొలగిస్తుండగా చేతికి పాముకాటు వేసింది. ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం బేతంచెర్ల సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి నలుగురు సంతానం ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతిచెందిన వ్యక్తి

కర్నూలు: కర్నూలు బళ్లారి చౌరస్తా ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లడంతో రెండు కాళ్లు విరగడంతో పాటు తలకు ఎడమ వైపు తీవ్ర గాయాలతో వ్యక్తి రోడ్డుపై పడిఉన్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వ్యక్తిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో మృతదేహాన్ని ఆసుపత్రి ఆవరణలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. మృతుడి వయస్సు 47 సంవత్సరాలు ఉంటుందని, 5.5 అడుగుల ఎత్తు, ఛామన ఛాయ రంగులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నీలం, పసుపు రంగు గీతలు కలిగిన రెడీమేడ్ ఫుల్ షర్టు, ఎరుపు రంగు గీతలు కలిగిన లేత నీలి రంగు నిక్కర్ ధరించాడు. ఆచూకీ తెలిసినవారు 91211 01078 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- పీజీఆర్‌ఎస్‌కు 83 ఫిర్యాదులు


సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ

కర్నూలు: ఇంటర్ చదివిన మా అమ్మాయి, అబ్బాయికి కలెక్టరేట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఫరూక్ అనే వ్యక్తి రూ.2.26 లక్షలు తీసుకుని మోసగించాడని కర్నూలు అరుంధతి నగర్‌కు చెందిన డి.ఉమాబాయి ఫిర్యాదు చేశారు. కర్నూలు టూటౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి వారితో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 83 ఫిర్యాదులు రాగా, చట్ట పరిధిలో విచారణ జరిపి బాధితులకు తగు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా కూడా కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలపై వినతులను స్వీకరించారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చి హామీ నిలుపుకోవాలి


నంద్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం సొంతిల్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని, అలాగే సూపర్ సిక్స్ హామీలు అమలు చేసేంత వరకు సీపీఐ పోరాటం ఆగదని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల సీపీఐ కార్యాలయం నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రామకృష్ణ మాట్లాడారు. జూన్ 12 నాటికి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతుందని, ఇప్పటివరకు ఒక్క హామీ కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. చేత కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్ర కేబినెట్‌లో తీర్మానం చేసి ఇంత వరకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. తల్లికి వందనం, మహిళలకు నెలకు రూ.1500, ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ వెంటనే అమలు చేయాలన్నారు. రేషన్ పంపిణీలో అక్రమాలకు తావిచ్చేలా వాహనాలను రద్దు చేసి మళ్లీ షాపులను తీసుకురావడం మంచిపద్ధతి కాదన్నారు. అనంతరం సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ.. పట్టణంలో ఇళ్లు లేని 13 వేల మంది లబ్ధిదారులను గుర్తించామని, ఇప్పటివరకు 2470 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారందరికీ ఇళ్ల స్థలాలు వచ్చే వరకు సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు.. ఎప్పుడో?

- సున్నిపెంటలో శ్రీశైల దేవస్థాన సిబ్బందికి వసతి గృహ సముదాయాలు
- రూ.39 కోట్లతో 297 గృహాలతో క్వార్టర్స్
- అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కల్పనకు చర్యలు
- దేవదాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు.. త్వరలో టెండర్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఉద్యోగులకు వసతి గృహ సముదాయాల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సున్నిపెంట గ్రామంలో ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలాన్ని దేవస్థానం బదలాయించి ఆ ప్రదేశంలో వసతి గృహాలను నిర్మించింది. ఏ, బీ, సీ మూడు బ్లాకులుగా విభజించి మొత్తం 297 గృహాలను రూ.39 కోట్ల వ్యయంతో నిర్మించారు. అయితే దేవస్థాన వసతి సముదాయాల వద్ద మౌలిక సదుపాయాలు ఎప్పుడు కల్పిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

మూడు బ్లాకుల్లో 297 గృహాలు

శ్రీశైల దేవస్థానం రెగ్యులర్ ఉద్యోగులు సుమారు 260 మంది ఉంటారు. వీరికోసం ఆలయానికి 8 కిలోమీటర్ల దూరంలోని సున్నిపెంటలో ఇరిగేషన్ శాఖకు చెందిన 20 ఎకరాలలో వసతి గృహ సముదాయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మూడు బ్లాకులుగా విభజించి క్వార్టర్స్ నిర్మాణాలు చేపట్టారు. ఏ–బ్లాకులో మొత్తం 4 భవనాలు ఉన్నాయి. ఒక్కో భవనంలో 27 గదులు నిర్మిస్తున్నారు. ఈ గృహాలను అటెండర్లు, వాచ్‌మన్లు, కిందిస్థాయి సిబ్బంది (నాల్గవ తరగతి ఉద్యోగుల) కోసం ఎకనామీ క్లాస్‌గా నిర్మించారు. అలాగే బి–బ్లాకులో మొత్తం నాలుగు భవనాలు ఉన్నాయి. ఒక్కో భవనంలో 27 గదులు నిర్మించారు. సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు తదితరుల కోసం నిర్మించారు. ఇందులో సింగిల్ బెడ్ రూం, హాలు, కిచెన్ ఉంటాయి. అలాగే సీ–బ్లాకులో మొత్తం మూడు భవనాలు ఉన్నాయి. ఒక్కో భవనంలో 27 గదులు నిర్మించారు. రెండు బెడ్ రూంలు, హాలు, కిచెన్ ఉండేలా నిర్మించారు. సూపరింటెండెంట్, సహాయ కార్యనిర్వహణాధికారి తదితర వారి కోసం నిర్మిస్తున్నారు. ఏ, బీ, సీ బ్లాకులలో మొత్తం 297 వసతి గృహాలు నిర్మించారు. ఆయా గృహాల సముదాయాల నిర్మాణ పనులను కాంట్రాక్టర్ పూర్తిచేసి, దేవస్థానానికి అప్పగించేందుకు సిద్ధమయ్యారు.


ఉద్యోగుల కోసం నిర్మించిన గృహ సముదాయం

అదనపు సౌకర్యాలకు ప్రతిపాదనలు

దేవస్థాన ఉద్యోగుల క్వార్టర్స్‌లో అంతర్గత రోడ్లు నిర్మించాల్సి ఉంది. అలాగే అటవీ జంతువులు రాకుండా చుట్టూ ఫెన్సింగ్, తాగునీటి కోసం శ్రీశైలం డ్యాం నుంచి పైప్‌లైన్, స్టోరేజ్ ట్యాంకులు, విద్యుత్ సౌకర్యం కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆయా పనులకు టెండర్లు పిలిచేందుకు ఇంజినీరింగ్ అధికారులు దేవదాయశాఖ కమిషనర్ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపారు. చీఫ్ ఇంజినీర్ స్వయంగా క్షేత్రానికి వచ్చి పరిశీలించి అనుమతులిస్తారు.

ఆగస్టుకంతా ఉద్యోగస్తులను తరలిస్తాం



శ్రీశైల దేవస్థానం ఉద్యోగుల కోసం నిర్మిస్తున్న వసతి గృహ సముదాయం పనులు దాదాపు పూర్తయ్యాయి. క్వార్టర్స్‌లో తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం, అంతర్గత రహదారులు, డ్రైనేజీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తాం. ఇప్పటికే వసతి గృహ సముదాయాన్ని ఐఐటీ నిపుణులు పరిశీలించారు. త్వరలో లాటరీ పద్ధతిలో ఉద్యోగులకు గృహాలు కేటాయిస్తాం. విద్యుత్ అంతరాయం లేకుండా 33/11 కె.వి.సబ్‌స్టేషన్‌ను సైతం ఏర్పాటు చేయబోతున్నాం. ఆగస్టు నెల చివరి నాటికి ఉద్యోగుల తరలింపు ప్రక్రియ పూర్తి చేస్తాం. ఉద్యోగులు విధులకు హాజరయ్యేందుకు ఇబ్బందులు లేకుండా శ్రీశైలం నుంచి వసతి గృహాల వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం.

– ఎం.శ్రీనివాసరావు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

రాజైనా రైతైనా.. కొడుకైనా కూతురైనా
కలెక్టరైనా బంట్రోతైనా.. ఊరైనా పట్నమైనా
మనిషికి ప్రాప్తమయ్యే మొదటి వాహనం సైకిల్.
దోగాడే వయసులో ట్రై సైకిల్ తొక్కి
బైస్కిల్‌కు ఎదగడమే చేయాల్సింది.
ఇక అక్కడి నుంచి ఎక్కడికి చేరినా
జీవితాన్ని బేలెన్స్ చేసుకుంటూ
ముందుకు సాగమని చెబుతుంది సైకిల్.
ప్రతి ఒక్కరి బాల్యంలో సైకిల్ విడదీయరానిది.
ఆ మాటకొస్తే సైకిల్‌లోని ప్రతి పార్ట్
జీవన సందేశాన్ని వినిపిస్తుంది.
అసలు సైకిల్‌ని ఇష్టపడని వారెవరు?


నేడు వరల్డ్ సైకిల్ డే

మొదటి వాహనముకు వందనం!



సైకిల్!

ట్రింగ్ ట్రింగ్‌మని బెల్లు కొడుతూ జ్ఞాపకాలు కమ్ముకుంటున్నాయా?

చిన్నప్పుడు ఎవరిదో ఇంటి ముందు సైకిల్ స్టాండ్ వేసి ఉంటే కింద కూచుని పెడల్ తిప్పుతూ వెనుక చక్రం గిర్రున తిరుగుతుంటే చూసిన జ్ఞాపకం. ముందు చక్రంలో వెనుక చక్రంలో స్పోక్స్ మధ్యన ఉండే ఇంద్రధనువు రంగుల కుచ్చు గుబ్బలను ఆసక్తిగా చూసిన జ్ఞాపకం. వెనుక సీటుకు డైనమో ఉంటుంది. అది ఆన్ చేస్తే బ్యాక్ టైర్‌కు అంటుకుంటుంది. టైరు తిరిగే కొద్దీ డైనమో నుంచి కరెంటు జనరేట్ అయ్యి ముందున్న బల్బు వెలుగుతుంది. ఆ రోజుల్లో రాత్రుళ్లలో లైటు వెలిగే సైకిల్ తొక్కేవాడు గొప్ప.



అవును. సైకిల్ తొక్కడం గొప్పే. ఎంతమంది దగ్గర ఉండేదని. ఒకవేళ ఉన్నా అందులో అంతరం. ర్యాలీ, హంబర్ సైకిళ్లు ఉన్నవారు శ్రీమంతులు, హీరో సైకిల్ ఉన్నవారు మధ్య తరగతి వారు, అట్లాస్ అంటే ఇక పేదవాళ్లు కొని తెగ తొక్కడమే. ఆ తర్వాత బి.ఎస్.ఎ సైకిళ్లు వచ్చాయి. వాళ్లు తెచ్చిన లేడీస్ సైకిళ్లు ఆడపిల్లలను వాటిపై కూచోబెట్టి నేరుగా స్కూళ్లకు కాలేజీలకు పంపాయి. చిన్న పట్టణాల్లో సాయంత్రాలు సైకిల్ తొక్కుతూ వెళ్లే ఆడపిల్లలకు ఉండే క్రేజ్ సామాన్యం కాదు.

మగాడికి 'మగాడు' అనిపించుకునే సవాళ్లు సమాజం పెడుతూ ఉంటుంది. ఆ సవాళ్లలో ఒకటి సైకిల్ తొక్కడం నేర్చుకోవడం. ఏడు, ఎనిమిది తరగతులకు రావడంతోటే ఊళ్లలో పల్లెల్లో పిల్లలు సైకిల్ నేర్చుకుని ఉండాల్సిందే. 'ఏంటి.. మీవాడికి ఇంకా సైకిల్ తొక్కడం రాదా' అనంటే అవమాన పడిపోయే తండ్రులు ఉండేవారు. కొడుకు తిట్లతో రెచ్చగొట్టి 'సైకిల్ తొక్కుతావా లేదా' లేదా అని ఎక్కించి వెనుక పరిగెత్తుతూ నేర్పించేవారు. ఆ రోజుల్లో పిల్లలు తొక్కే సైకిళ్లు ఎక్కడివని? అన్నీ పెద్దలు తొక్కేవే. అందుకే పిల్లలు మొదట ఆఫ్ పెడల్ తొక్కి, ఆ తర్వాత ఫ్రంట్ బార్ మీద కూచుని తొక్కి, కాళ్లందే ఎత్తు పెరిగాక సీటు మీద కూచుని తొక్కేవారు.

సైకిల్ తొక్కడం అంత వీజీ కాదు. ఆ రోజుల్లో ప్రతి సైకిలూ తన యజమానిని సొంత ఊరి చెరువు నీళ్లు గటగటా తాగించేది. ఒక సైకిలుకు బ్రేకులు పడవు. ఒక సైకిల్‌కు పెడళ్లు ఊడిపోతాయి. ఒక సైకిల్‌కు చైను లూజు. మరో సైకిలుకు స్టాండ్ పడదు. స్టాండ్ వేసి జరగ్గానే ధబేలున పడుతుంది. ఒక సైకిలుకైతే సీటు అట్టగట్టుకుని పోయి కూచుంటే ముళ్ల మీద కూచున్నట్టు ఉంటుంది. ఒక సైకిలు సైడుకు లాగుతూ ఉంటుంది. ఒక సైకిలుకు హ్యాండిలు వంకర. ఇక పంక్చర్లు వేసి వేసి లోపల టైరు బ్యారుమన్నా ఓనరు కనికరించక దాన్ని తొక్కుతూనే ఉంటాడు. డబ్బులే లేని ఆ కాలంలో సైకిలే సిరి.

సైకిల్ వల్ల ఫ్రెండ్‌షిప్స్ ఏర్పడతాయి. ఫ్రంట్ రాడ్ మీద కూచుని సినిమాకొచ్చే వాడొకడు. బ్యాక్ క్యారేజీ మీద కూచుని సంతకు పోదాం అనేవాడొకడు. ఎదురుగాలిలో తొక్కుతుంటే వెనుక కూచున్నవాడు కూడా తోడు తొక్కుతాడు. అంటే రెండు పెడళ్ల మీద నాలుగు కాళ్లు. సైకిల్ డౌన్‌లో తొక్కేటప్పుడు గడ్డిపోచకంటే తేలిగ్గా ఉంటుంది. ఎదురుగాలిలో తొక్కుతుంటే రాకాసి దెయ్యమంత బరువు పెరుగుతుంది. అన్నింటి కంటే హింస ఏమిటంటే చైనుకు ఉన్న మడ్‌గార్డు గనుక పెడల్‌కు రాసుకుంటూ ఉంటే మనం వీధి వెంట వెళుతున్నామని ప్రతి ఒక్కరూ గుర్తిస్తారు.. ఆ గర్‌గర్‌మనే సౌండ్‌కి.

సైకిల్‌కు సింగారాలు చేసేవారు ఉండేవారు. హ్యాండిల్‌కు చెరొక మిర్రర్‌ని బిగించే సోగ్గాళ్లు ఉండేవారు. హ్యాండిల్ మీద ఫ్రంట్ క్యారేజ్ బిగిస్తే వాటి మీద బుక్స్ పెట్టుకోవచ్చు. సీటుకు స్పాంజ్ కవర్ చాలా షోకు. స్టీలు బిందెల మీద పేర్లు రాసినట్టు సైకిల్ హ్యాండిల్ మీద ఓనర్ పేరు రాయించడం సేఫ్. సైకిల్ దొంగతనం అయితే పోలీసులు ఆ పేరును బట్టి వాపసు చేసేవారు.

ఆ రోజుల్లో అద్దె సైకిళ్ల జమానా నడిచింది. ఐదారు సైకిళ్లు అద్దెకు ఇస్తూ బతికే వారుండేవారు. సైకిళ్లన్నీ అద్దెకెళ్లిపోతే కావాల్సిన వాళ్లు వెయిట్ చేస్తూ కూచునేవారు. కొందరైతే రేప్పొద్దున నాకు సైకిల్ కావాలి అని ముందే అద్దెకు మాట్లాడుకునేవారు. సైకిల్ లేకుండా పని ఎవరికి జరిగేదని? సామాన్లు తెచ్చుకోవాలన్నా, పక్కూరికి పనికి వెళ్లాలన్నా, నీళ్లు తెచ్చుకోవాలన్నా, ఎవరికైనా బాగా లేకపోతే డాక్టర్‌ని పిలుచుకు రావాలన్నా, చావు కబురు చెప్పాలన్నా సైకిలే గతి.

సైకిల్ వేదాంతి. బతుకు బండిని బేలెన్స్ తప్పకుండా చూసుకోమని, అత్యాశలకూ అతి కోరికలకూ బ్రేకులు వేస్తూ నువ్వెంత తొక్కగలవో అంతలోనే బతకమని, మంచి అనుబంధాలనే ఆయిల్‌ను తరచూ రిమ్ములకు రాస్తూ ఉండమని, మంచి చెడ్డల్లో పాల్గొంటూ సైకిల్ బెల్లులా ఉనికి చూపమని, వెనుక క్యారేజీ మీద కూచోబెట్టుకునే పాటి సహాయమైనా ఇతరులకు చేస్తూ ఉండాలని, జీవితపు పరుగుకు అప్పుడప్పుడు స్టాండ్ వేసి నిలబెట్టమని లేదంటే కనీసం సైడ్ స్టాండ్ వేయమని చెబుతుంటుంది. లేదంటే హటాత్తుగా సైకిల్ మొరాయించి ఓవరాయిలింగ్‌కు వస్తుందని హెచ్చరిస్తుంది.

సైకిల్‌లా సింపుల్‌గా బతకడం ఇవాళ చాలా కష్టమైపోతుంది. కాసింత గాలి కొడితే ఇక సైకిల్ ఏమీ అడగదు. కాని నేడు మనం ఉపయోగిస్తున్న, వాడుతున్న, అందుకోవాలనుకుంటున్న ప్రతిదీ మన నుంచి చాలా అడుగుతున్నాయి.

ఇంటి వాకిటలో నిలబెట్టిన సైకిల్ ఎంత నిమ్మళంగా ఉంటుంది!

'వరల్డ్ సైకిల్ డే' రోజున జీవితపు వేగాన్ని తగ్గించుకుని ఆస్వాదనకు పెడల్ వేద్దాం.

– కె.

ఉమెన్ సేఫ్టీ

ఆపదలో అండగా...


కరణ్



బహిరంగ ప్రదేశాల్లో మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకొని మైసూర్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ స్టూడెంట్ కరణ్ సరికొత్త పరికరాన్ని తయారు చేశాడు.

ఐజీడబ్ల్యూఎస్(ఇన్నోవేటివ్ ఇంటెలిజెంట్ జీయోఫెన్స్–ఎనేబుల్డ్ వేరబుల్స్ సిస్టమ్స్) అనే పరికరం మహిళలు ఆపదలో ఉంటే వారి ఎమర్జెన్సీ కాంటాక్ట్‌ను ఎలార్ట్ చేస్తుంది.

'డివైజ్‌లోని ముఖ్యమైన ఫీచర్‌లలో ఒకటి...జియోఫెన్స్–బేస్డ్ డిటెక్టర్. ఒక మహిళని ఎవరైనా మూడు నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాలో అవుతున్నప్పుడు ఈ డివైజ్ సందేహాస్పద వ్యక్తి మొబైల్ ఫోన్‌ను గాని, బ్లూటూత్ డివైజ్ అడ్రస్ గుర్తించడానికి ఉపయోగపడుతుంది' అంటున్నాడు కరణ్.

ఈ డివైజ్‌లో జియోఫెన్స్–బేస్డ్ సేఫ్టీ టైమర్ కూడా ఉంటుంది. యూజర్ ఒక డెస్టినేషన్ చేరుకోవడానికి టైమ్ సెట్ చేసుకోవచ్చు. ఒక అమ్మాయి షాపింగ్‌కు వెళ్తూ 30 నిమిషాలలో ఇంటికి వస్తానని చెబితే సిస్టమ్ ఆమె జియోలోకేషన్‌ని మానిటర్ చేస్తుంది. సెట్ చేసిన టైమ్ లోపు ఇంటి జియోఫెన్స్‌లోకి రాకపోతే డివైజ్ ఆటోమెటిక్‌గా ఆమె లోకేషన్‌ని ఎమర్జెనీ కాంటాక్ట్‌కి పంపిస్తుంది. డివైజ్‌లో 'రిటర్న్ హోమ్ సేఫ్టీ రిమైండర్' కూడా ఉంటుంది. డివైజ్‌లో మరో సేఫ్టీ ఫీచర్...డేంజర్–జోన్ నోటీఫైయర్. ఇది హై–రిస్క్ జీపీఎస్ లొకేషన్స్ ప్రీలోడెడ్ జాబితాను ఉపయోగిస్తుంది. యూజర్ ఈ ప్రాంతాలలోకి వెళ్లినప్పుడు వేరబుల్ బజర్ యాక్టివేట్ అవుతుంది. ఎమర్జెన్సీ కాంటాక్ట్‌కి తెలియజేస్తుంది.

సమ్‌థింగ్ స్పెషల్

దుప్పటి లెహంగా



'ఫ్యాషన్ అనేది ఫ్యాబ్రిక్ స్టోర్ నుంచి కాదు మన ఊహాల నుంచి మొదలవుతుంది' అంటారు. సిమ్రాన్ క్రియేటివిటీని చూస్తే 'నిజమే సుమీ' అనిపిస్తుంది. దిల్లీకి చెందిన కంటెంట్ క్రియేటర్ సిమ్రాన్ ఆనంద్ ఇరవై కిలోల బెడ్ షీట్‌ను ఆకట్టుకునే లెహంగాగా మార్చి ఔరా అనిపిస్తోంది.

'ఔట్‌ఫిట్ ఫ్రమ్ స్క్రాచ్' కాప్షన్‌తో ఒక వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది సిమ్రాన్.

'ఎందుకు ఇలా?' అనే ప్రశ్నకు ఆమె ఇచ్చిన జవాబు... 'బెడ్ షీట్‌లలో నాకు ఫ్యాషన్ కనిపించింది'

'లెహంగాగా మార్చడం ద్వారా దుప్పట్లకు సెకండ్ లైఫ్ కూడా ఇవ్వవచ్చు' అంటుంది సిమ్రాన్.

ఇక నెటిజనుల స్పందన విషయానికి వస్తే... 'దుప్పటితో లేహంగా ఏమిటీ!' అనే వెక్కిరింపుల కంటే...

'క్రియేటివ్ ఐడియా' అనే ప్రశంసలే ఎక్కువగా కనిపించాయి.

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 2న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,110
బంగారం (22 క్యారెట్లు)	90,069
వెండి	99,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	98,670
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,00,100
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	97,910
బంగారం (22 క్యారెట్లు)	89,751
వెండి	1,01,090
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	98,670
బంగారం (22 క్యారెట్లు)	92,180
వెండి	1,00,100
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,250
బంగారం (22 క్యారెట్లు)	88,550
వెండి	98,600
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	97,630
బంగారం (22 క్యారెట్లు)	89,500
వెండి	1,11,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి సినిమా


● 'ఘాటి' పోస్టర్

జూలైలో ఘాటి

హీరోయిన్ అనుష్కాశెట్టి, దర్శకుడు క్రిష్ జాగర్లమూడి కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'ఘాటి'. తమిళ నటుడు విక్రమ్ ప్రభు మరో లీడ్ రోల్ చేశారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించిన ఈ సినిమాని జూలై 11న విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న 'ఘాటి' సినిమాకు నాగవెల్లి విద్యా సాగర్ సంగీతం అందించగా, సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు. వ్యాపార రంగంలో పైస్థాయికి వెళ్లాలనుకునే ఓ మహిళను కొందరు మోసం చేస్తారు. దీంతో ఆ మహిళ వారికి తగిన బుద్ధి చెప్పి, వ్యాపారంలో అత్యున్నత స్థాయికి ఎలా చేరుకుంటారు? అనే నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని టాక్.

మనసు నీకై రథమయ్యే రారా...


● కమల్‌హాసన్

కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వం వహించిన చిత్రం 'థగ్ లైఫ్'. శింబు, త్రిష, అభిరామి, నాజర్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 5న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్‌పై ఎన్. సుధాకర్ రెడ్డి రిలీజ్ చేస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'విశ్వద నాయక...' అంటూ సాగే నాలుగో పాటని విడుదల చేశారు. 'విశ్వద నాయక.. విహిత వీరా... మనసు నీకై.. రథమయ్యే రారా...' అంటూ ఈ పాట సాగుతుంది. ''ఈ పాటలో కమల్‌హాసన్ క్యారెక్టర్ నేచర్, అభిరామి, త్రిష పాత్రల్లోని డైనమిక్స్‌ని లిరిక్ రైటర్ అనంత శ్రీరామ్ అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ప్రశాంత్ వెంకట్ రాసిన ర్యాప్ ఈ పాటకు మరో స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. అలెగ్జాండ్రా జాయ్ వండర్ ఫుల్ వోకల్స్ ఎమోషన్‌ని నావిగేట్ చేయగా, ఏఆర్ అమీన్ ర్యాప్ ఎనర్జీని మరింతగా పెంచింది'' అని చిత్రబృందం పేర్కొంది.

కుబేర ప్రేక్షకులకి నచ్చుతుంది

– నాగార్జున


● నాగార్జున, ధనుష్

''చెన్నై ప్రేక్షకుల నుండి సంవత్సరాలుగా నాకు లభించిన ప్రేమకు కృతజ్ఞతలు. 'కుబేర'ని శేఖర్‌గారు అద్భుతంగా తీశారు. ఈ చిత్రం ప్రేక్షకులకి కచ్చితంగా నచ్చుతుంది. ఈ మూవీ తర్వాత రజనీకాంత్ గారి 'కూలీ' సినిమా ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయడానికి రెడీగా ఉంది'' అని హీరో నాగార్జున అక్కినేని తెలిపారు. ధనుష్, నాగార్జున హీరోలుగా, రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి ఎస్‌వీసీ ఎల్‌ఎల్‌పీపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన 'కుబేర' ఆడియో లాంచ్ చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో ధనుష్ మాట్లాడుతూ–''కుబేర' కోసం తిరుపతిలో ఎండలో చెప్పులు లేకుండా, చిరిగిన బట్టలతో బిచ్చగాడిగా నటించడం మరచిపోలేను. ఆ అనుభవం జీవితంలోని ముఖ్యమైన సత్యాలను గుర్తు చేసింది'' అన్నారు. ''కుబేర' నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన సినిమా'' అన్నారు రష్మికా మందన్నా. ''ధనుష్, నాగార్జునగారి నటన మెస్మరైజింగ్‌గా ఉంటుంది'' అని శేఖర్ కమ్ముల తెలిపారు. ''సినిమా చాలా అద్భుతంగా వచ్చింది.. గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు పుస్కూర్ రామ్‌మోహన్ రావు, సునీల్ నారంగ్. ఈ కార్యక్రమంలో దేవి శ్రీ ప్రసాద్, నిర్మాతలు జాన్వీ నారంగ్, భరత్ నారంగ్, సిమ్రాన్ నారంగ్, కెమేరామేన్ నికేత్ బొమ్మి, ప్రొడక్షన్ డిజైనర్ తోట తరణి, లిరిక్ రైటర్స్ వివేక, చంద్రబోస్, నంద కిషోర్ పాల్గొన్నారు.

దీపావళికి తెలుసు కదా


● సిద్ధు జొన్నలగడ్డ

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా, రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లుగా, వైవా హర్ష కీలక పాత్రలో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతీ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాని దీపావళి పండుగ సందర్భంగా అక్టోబరు 17న రిలీజ్ చేయనున్నట్లు సోమవారం మేకర్స్ ప్రకటించారు. ''మనసును తాకేలా, ఊహించని మలుపులతో ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

క్లైమాక్స్ చూసి భావోద్వేగం అవుతున్నారు

– రూపేశ్


● పవన్ ప్రభ, రాజేంద్ర ప్రసాద్, రూపేశ్

''షష్టిపూర్తి' అనేది కల్చరల్ బ్లాక్ బస్టర్ కాదు.. కల్ట్ బ్లాక్ బస్టర్. 'పెళ్లి పుస్తకం' చిత్రం నుంచి 'షష్టిపూర్తి' వరకు ఏ నటుడికి దక్కని సినిమా ప్రయాణం నాకు దక్కింది. 'షష్టి పూర్తి' చూస్తూ ప్రేక్షకులు ఏడ్చేస్తున్నారంటేనే మేం విజయం సాధించినట్టు'' అని రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. పవన్ ప్రభ దర్శకత్వంలో రాజేంద్ర ప్రసాద్, అర్చన, రూపేశ్, ఆకాంక్షా సింగ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. రూపేశ్ నిర్మించిన ఈ సినిమా మే 30న విడుదలైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన కల్చరల్ బ్లాక్‌బస్టర్ మీట్‌లో రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ–''విజయ, వాహినీ, ఏవీఎం వంటి గొప్ప ప్రొడక్షన్ కంపెనీల్లో పని చేసిన అనుభవంతో చెబుతున్నాను.. నిర్మాతగా రూపేశ్ గొప్ప స్థాయికి వెళ్తాడు. ఇలాంటి పాత్రలు నా చివరి శ్వాస వరకు చేయాలనుకుంటున్నాను'' అన్నారు. హీరో, నిర్మాత రూపేశ్ మాట్లాడుతూ–''షష్టిపూర్తి'ని ఇంతలా ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమా క్లైమాక్స్ చూసి భావోద్వేగం అవుతున్నారు'' అని తెలిపారు. ''షష్టిపూర్తి' లాంటి మంచి చిత్రాలను ఆదరిస్తే నా లాంటి దర్శకులు, రూపేశ్ లాంటి నిర్మాతలు ఇంకా ముందుకు వస్తారు'' అన్నారు పవన్ ప్రభ. ఈ కార్యక్రమంలో కెమేరామేన్ రామ్, పాటల రచయిత చైతన్య ప్రసాద్ మాట్లాడారు.

తెలంగాణ కళాకారులకు అన్యాయం జరిగింది

– ప్రతాని రామకృష్ణగౌడ్


● అమృత్ గౌడ్, రమేశ్ నాయుడు, ప్రతాని రామకృష్ణ, కిరణ్

''తెలంగాణ ప్రభుత్వం గద్దర్‌గారి పేరుతో అవార్డ్స్ ఇవ్వడం సంతోషంగా ఉంది. అయితే ఈ అవార్డు కమిటీ జ్యూరీకి మురళీ మోహన్, జయసుధలను చైర్మన్లుగా నియమించడం ఏంటో అర్థం కాలేదు. ఎఫ్‌డీసీ చైర్మన్‌గా 'దిల్' రాజు తన అధికారాలను దుర్వినియోగం చేశారు. తన వాళ్లకే అవార్డ్స్ ఇచ్చుకున్నారు. జ్యూరీ కమిటీలో ఉన్నవాళ్ల సినిమాలకు అవార్డ్స్ ఇవ్వకూడదనే నిబంధనలను పాటించ లేదు. థియేటర్స్ బంద్ విషయంలోనూ 'దిల్' రాజు ప్రమేయం ఉంది'' అని 'తెలంగాణ ఫిలిం చాంబర్' చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ–''గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్'లో తెలంగాణ కళాకారులకు, సాంకేతిక నిపుణులకు అన్యాయం జరిగింది. జ్యూరీ కమిటీ సభ్యులు అన్ని సినిమాలు చూడలేదు. థియేటర్స్‌లో పర్సంటేజీ విధానం వల్ల గతంలో లాభాలు ఆర్జించిన డిస్ట్రిబ్యూటర్స్‌కు ప్రస్తుత విధానాల వల్ల నష్టాలు వస్తున్నాయి. 2002 వరకు థియేటర్స్‌లో పర్సంటేజీ విధానం ఉండేది. ఆ తర్వాత నిర్మాత డి. సురేష్ బాబులాంటి కొందరు తమ స్వార్థంతో అద్దె విధానాన్ని మొదలు పెట్టారు. ఆ తర్వాత నిర్మాతలు అల్లు అరవింద్, 'దిల్' రాజు, ఏషియన్ సునీల్.. లాంటి వాళ్లు సురేష్ బాబు బాటలోనే నడిచి థియేటర్స్‌ను తమ కబంధ హస్తాల్లో పెట్టుకున్నారు'' అన్నారు. ''గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్'లను ప్రభుత్వం పునః పరిశీలించాల్సిన అవసరం ఉంది'' అన్నారు టీఎఫ్‌సీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, నటుడు కిరణ్, తెలంగాణ డైరెక్టర్స్ యూనియన్ ప్రెసిడెంట్ రమేష్ నాయుడు, తెలంగాణ రైటర్స్ యూనియన్ ప్రెసిడెంట్ అమృత్ గౌడ్ కోరారు.

నాన్న అంటేనే దైవం


● పృథ్వీ అంబర్, సాయికుమార్

''నాన్న అంటేనే మొదటి దైవం.. తను పోసిన ప్రాణమిది.. నాన్న అనగానే వాలే నీ ముందు.. అలుపెరుగని ప్రాణమిది.. మన కొరకే బతికే ప్రాణం.. మన బాధ్యత ఒకటే ధ్యానం'' అంటూ సాగుతుంది 'చౌకీదార్' సినిమాలోని 'నాన్న' యాంథమ్ పాట లిరికల్ వీడియో. పృథ్వీ అంబర్, ధన్యా రమ్యకుమార్ జంటగా, సాయికుమార్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'చౌకీదార్'. చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వంలో డా. కల్లహల్లి చంద్ర శేఖర్ నిర్మించారు. సచిన్ బస్రూర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'నాన్న..' పాటను విడుదల చేశారు. ఈ పాటకు సంతోష్ వెంకీ సాహిత్యం అందించగా, విజయ్ ప్రకాష్ ఆలపించారు. త్వరలో సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నట్లుగా మేకర్స్ తెలిపారు.

డేంజర్ బాయ్స్


● వికాస్, రాధా

వికాస్ ఉత్తయ్య, రాధా భగవతి, అశ్విన్ హసన్, రాఘవ్ కొడబాద్రి, మిథున్ తీర్థహళ్లి ప్రధాన పాత్రల్లో నటించిన కన్నడ చిత్రం 'అపాయవీడి హెచ్చరిక'. అభిజిత్ తీర్థహళ్లి దర్శకత్వంలో వి.జి.మంజునాథ్, పూర్ణిమ ఎమ్.గౌడ్ నిర్మించిన ఈ చిత్రం కన్నడలో హిట్‌గా నిలిచింది. ఈ సినిమాను యశ్విని క్రియేషన్స్, గీతా ఫిలిమ్స్‌పై శ్రీరంగం సతీష్ కుమార్ తెలుగులో 'డేంజర్ బాయ్స్' టైటిల్‌తో త్వరలో విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ 'డేంజర్ బాయ్స్' ఫస్ట్‌లుక్‌ని, దర్శక–నిర్మాత సాయివెంకట్ టీజర్‌ను, నిర్మాత టి.రామసత్యనారాయణ– జాతీయ మానవ హక్కుల కమిషన్ మెంబర్ సత్య వర్ధన్ ఈ సినిమా పాటలను రిలీజ్ చేశారు.

తొలిప్రేమ తోపేం కాదు!


● శ్రీ గౌరీప్రియ, కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'చెన్నై లవ్ స్టోరీ' అనే టైటిల్ ఖరారు చేశారు. 'కలర్ ఫొటో, బేబి' చిత్రాల దర్శకుడు సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ గౌరీప్రియ హీరోయిన్. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్‌పై సాయి రాజేశ్, ఎస్‌కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా చేతుల మీదుగా 'చెన్నై లవ్ స్టోరీ' అనే టైటిల్ ఫస్ట్ లుక్, గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'ఫస్ట్ లవ్ ఫెయిలైతే బెస్ట్ లవ్ ఎక్కడో మొదలవుతుంది', 'తొలిప్రేమ అంత తోపేం కాదు' అంటూ కిరణ్ చెప్పే డైలాగులు గ్లింప్స్‌లో ఉన్నాయి.